కుందూ మురుగు మయం!

- నదిలో కలుస్తున్న పట్టణ మురుగునీరు, వ్యర్థాలు
- కలుషితమవుతున్న నీరు
- అనారోగ్యాల పాలవుతున్న నదీ తీర ప్రాంత ప్రజలు



కుందూనది



బైటిపేట వద్ద కుందూలో కలుస్తున్న మురుగునీరు

నంద్యాల(అర్బన్): కుందూనదిలో కలుస్తున్న వ్యర్థాలు అనర్థాలకు దారితీస్తున్నాయి. పట్టణ సమీపాన ఉన్న ఓ ఫ్యాక్టరీ వ్యర్థాలు, పట్టణ మురుగు నీరు, వ్యర్థాలు కుందూనదిలో కలుస్తున్నాయి. నదీ పరివాహక ప్రాంతాల్లోని దాదాపు 80 గ్రామాల ప్రజలు, పశుపక్షాదుల దాహార్తిని తీర్చే నదిలోని నీరు కలుషితమవుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో అవే నీటిని తాగి ప్రజలు, పశువులు అనారోగ్యాల పాలవుతున్నాయి. కలుషితనీరు కుందూలో కలువకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఏళ్లతరబడి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

కుందూ నది ప్రవహిస్తున్న మండలాలు..

కర్నూలు జిల్లాలోని పలు మండలాల్లోని గాలేరు, మద్దిలేరు, సంకలవాగు, తదితర వాగులు పాయలుగా వస్తూ నంద్యాల సమీపంలో ఒకటైన ప్రాంతాన్ని కుందూ నదిగా పిలువబడుతోంది. నంద్యాల, గోస్పాడు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, చాగలమర్రి, పెద్దముడియం, రాజుపాలెం తదితర ప్రాంతాల్లోని 80 గ్రామాల మీదుగా కుందూ నది ప్రవహిస్తోంది.

ఫ్యాక్టరీ వ్యర్థాలతో..

పట్టణ మురుగు నీటితోనే కుందూనది కలుషితమవుతుంటే నంద్యాల సమీపంలో కర్నూలు–కడప జాతీయ రహదారిలో ఏర్పాటైన ఓ ఫ్యాక్టరీ ద్వారా వస్తున్న వ్యర్థాలు కుందూలో కలుస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా కుందూ తీర ప్రాంత ప్రజలు వ్యర్థాలు రావడాన్ని వ్యతిరేకిస్తున్నా సంబంధిత అధికారులు, ప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నదికలుషితంకాకుండా ఆయా గ్రామాల్లోని ప్రజలు కలుషిత నీటిని వినియోగించుకుంటుండంతో చర్మవ్యాధులు, అనారోగ్య సమస్యలు సంక్రమిస్తున్నాయి.

నిలిచిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు..

పట్టణ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు గతంలో నిధులు మంజూరయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభమై నిధులు సరిపోకపోవడంతో పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. పనులు జరిగిన ఆనవాళ్లు మిగిలాయి తప్ప అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని కుందూ కలుషితం కాకుండా చూడాల్సిన అవసరం ఉందని పట్టణ, నదీతీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మురుగునీటి మయం..

దాదాపు 7లక్షల జనాభా ఉన్న పట్టణ మురుగు నీటిని మున్సిపల్ అధికారులు కుందూలో కలిపేస్తున్నారు. బాలాజీ కాంప్లెక్స్, శ్రీనివాసనగర్, చాంద్‌బాడ, టెక్కె తదితర ప్రాంతాల మురుగు నీరు పద్మావతి నగర్‌లోని ప్రధాన కాల్వ నుంచి శ్యామకాల్వలోకి, పెద్దకొట్టాల గ్రామ సమీపం నుంచి వస్తున్న పాలేరువాగు విశ్వనగర్, స్టేట్ బ్యాంక్ కాలనీల మురుగునీటితో కలుషితమవుతోంది. ఆ నీటిలో నూనెపల్లె, ఎన్జీఓ కాలనీ, సాయిబాబా నగర్, వీసీకాలనీ, దేవనగర్, రెవెన్యూ క్వార్టర్స్ తదితర ప్రాంతాల మురుగునీరు చేరి శ్యామకాల్వ ద్వారా ప్రథమనంది ఆలయ సమీపంలో కుందూలో కలుస్తుంది. అలాగే బండిఆత్మకూరు పికప్ ఆనకట్ట వద్ద నుంచి మద్దిలేరువాగు ద్వారా వస్తున్న నీరు నడిగడ్డ, ఆత్మకూరు బస్టాండు, ఫరూక్‌నగర్, బైర్మల్‌వీధి, బైటిపేట, ప్రాతాల్లోని మురుగునీరు దళితపేట వద్ద ఉన్న కుందూలో కలుస్తోంది. దశాబ్దాలుగా పట్టణ మురుగునీరు కుందూలో కలుస్తూ కలుషితమవుతూనే ఉంది. అయితే కుందూలో వస్తున్న నీటినే పలు గ్రామాల ప్రజలు తాగుతూ అనారోగ్యాల పాలవుతున్నారు.



శ్యామకాలువ నుంచి వెళ్తున్న ఇళ్లలోని మురుగునీరు

ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం

కుందూ నదిలో మురుగునీరు, పట్టణంలోని వ్యర్థాలు కలుస్తున్న మాట వాస్తవమే. అయితే ఇందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై ఉన్నతాధికారులు, పట్టణ ప్రజలతో చర్చించి, మేధావుల సలహాలు, ప్రభుత్వ సూచనల మేరకు చర్యలు చేపడతాం. ఇది దీర్ఘకాలం నుంచి వేధిస్తున్నదే. కొత్తగా ఇప్పుడు మొదలైంది కాదు. కలుషిత నీటిని తాగి నదీతీర ప్రాంత గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిసింది. కమిషనర్ వచ్చిన తరువాత ఆయన దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– వెంకటదాసు,
నంద్యాల మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ మండల నూతన కమిటీలను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నియమించారు. వైస్ ప్రెసిడెంట్లుగా నాగేషుడు, లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీలుగా విజయ్‌చంద్రారెడ్డి, మహమ్మద్ రఫీ, రామస్వామిరెడ్డి, శంకర్, సెక్రటరీలుగా డి.నరసింహుడు, షరీఫ్, ఎం,కిరణ్, జి.పెద్ద ఈశ్వరయ్య, పి.రమణతో పాటు 21 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు. కమిటీలో చోటు దక్కిన వారు మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

శిరివెళ్ల: ఉపాధ్యక్షులుగా వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, బీ.రియాజ్, జనరల్ సెక్రటరీలుగా ఎన్.ముజఫర్, జీ.కృష్ణారెడ్డి, వీ. రాజశేఖరరెడ్డి, రఘునాథరెడ్డి, సెక్రటరీలుగా పిక్కిలి నరహరి, ఎం. నాగభూషణంరెడ్డి, రామపుల్లయ్య, నారాయణ, చంద్రతోపాటు 24 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఉయ్యాలవాడ: మండల ఉపాధ్యక్షులుగా జి.కృష్ణారెడ్డి, రమణయ్య, ప్రధానకార్యదర్శులుగా ఎర్రారెడ్డి, చెన్నయ్య, పరశురాం, హరిప్రసాద్, కార్యదర్శులుగా మాబుసా, అల్లూరి బాబు, ఎం. శివానందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరావుతో పాటు 20 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటించింది.

పుట్టగొడుగుల పెంపకంతో ఆర్థిక ఆదాయం

మహానంది: పుట్టగొడుగుల పెంపకంతో ఆర్థిక ఆదాయం చేకూరుతుందని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి తెలిపారు. కళాశాలలో గురువారం బలపనూరు గ్రామ ఎస్సీ మహిళలకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పుట్టగొడుగులకు మంచి ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో ఓఎస్ఏ డాక్టర్ ఎల్.విజయభాస్కర్, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఫరీదా, డాక్టర్ గురివిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలశ దాతలకు మహాసంకల్పం



మహా సంకల్ప పూజలు చేస్తున్న వేద పండితులు

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్‌లోని శ్రీ కోదండ రామాలయంలో స్వర్ణోత్సవ మహాకుంభాభిషేక వేడుకల్లో రెండో రోజు గురువారం కలశ దాతలకు మహాసంకల్ప కార్యక్రమం వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఉదయం శాంతి పాఠం, గురువందనం, మండప పూజలు, సహస్ర ఘటస్థాపన, నానువాక ఆదిమంత్రణం, రుద్ర, చండీ, సుదర్శన హోమాలు, మూలమంత్రం, దాన్యాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు.సాయంకాలం ప్రదోషకాలంలో సయ్యాదివాసం, హారతి, మంత్రపుష్పం,వేద స్వస్తి కార్యక్రమాలు వేద పండితులతో జరిపించారు. ఆలయ అధ్యక్షుడు సూరయ్య శ్రీనివాస్ మాట్లాడుతూ శుక్రవారం జగద్గురు శ్రీ విద్యాశంకర భారతి మహాస్వామి ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గోస్పాడు: పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి గోపాల్ అన్నారు. పీహెచ్‌సీలో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎండలతో పాటు ఇటీవల వర్షాలు కురుస్తున్నాయని దీంతో గ్రామాల్లో మురుగు నీరు నిల్వతో దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలే అవకాశం ఉందని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమతెరలను వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కోరారు.

సిద్ధేశ్వరం బహిరంగ సభకు తరలిరండి

నంద్యాల అర్బన్: రాయలసీమ సాగునీటి హక్కుల సాధనే లక్ష్యంగా ఈనెల 31వ తేదీన సంగమేశ్వరంలో జరిగే ప్రజా బహిరంగ సభకు రైతులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో కోరారు. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే సభకు స్వచ్ఛందగా తరలి రావాలని పిలుపునిచ్చారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం మొదలైన తెలుగు గంగ, గాలేరి నగరి, హంద్రీనీవా, వెలుగొండ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. సిద్ధేశ్వరం అలుగు, సీడ్ హబ్, హార్టికల్చర్ హబ్ తదితర అంశాలు పాలకుల ప్రకటనలే పరిమితం అయ్యాయని విమర్శించారు. పట్టిసీమ, కృష్ణాజలాలు సీమకు ఇవ్వక పోగా రాయలసీమకు ప్రతి ప్రాజెక్టులోనూ అన్యాయం జరుగుతుందన్నారు. రూ. కోట్ల నిధులు అమరావతిలో ఖర్చు చేస్తూ సీమ యువతకు మాత్రం ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేకుండా నిర్లక్ష్యం చేస్తుందని పేర్కొన్నారు.

'వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల (వ్యవసాయం): పట్టణ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అంటికోట మస్జిద్‌లో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ముఖ్య అతిథి మహమ్మద్ రఫీ 'వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం' పుస్తకాన్ని అవిష్కరించారు. రఫీక్ జేఏసీ కన్వీనర్ అబ్దులరాషాది మాట్లాడుతూ..మతతత్వ వాదులు వక్ఫ్ చట్టం గురించి ముస్లింలలోనూ, ముస్లియేతరుల్లో తీవ్ర అపోహలు, అనుమానాలు కలిగేలా ప్రచారం చేశారని, వాటిని నివృతి చేయాల్సిన అవసరం ఉందన్నారు.అపోహలను తొలగించేందుకు ఈ పుస్తకం చక్కగా ఉపయోగపడుతుందన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అబుల్లైస్, ఇమ్రాన్‌మాషా, మస్తాన్, మోమిన్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



కోవెలకుంట్ల: రేవనూరు గ్రామంలోని ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. వచ్చే నెలలో బక్రీద్ ఉండగా ఈ వారం దర్గా భక్తులతో కిటకిటలాడింది. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్గాకు చేరుకున్నారు. జెండాలు, పూలదట్టీలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మహానాడుకు 'నేను రాను'!



బస్సు బ్యాటరీ నుంచి పొగలు వస్తుండటంతో కిందకు దిగిన మహిళలు

కడపలో టీడీపీ తలపెట్టిన మహానాడు కార్యక్రమానికి నంద్యాల నుంచి కార్యకర్తలను తీసుకెళ్లే ఆర్టీసీ బస్సు మొరాయించింది. స్థానిక నూనెపల్లికి చెందిన కొందరు మహిళా టీడీపీ కార్యకర్తలు మహానాడుకు బయలుదేరారు. కొంత దూరం వెళ్లగానే బస్సు బ్యాటరీ నుంచి పొగలు వచ్చాయి. గమనించిన ఓ మహిళా కార్యకర్త కేకలు వేయడంతో డ్రైవర్ బస్సు నిలిపేశాడు. పొగలు కొద్ది సేపటికి దట్టంగా వెలువడటంతో బస్సులో ఉన్న మహిళలు ఆందోళన చెంది బస్సు దిగారు. బ్యాటరీ వద్ద మర్మతులు చేసుకుని కొంత సేపటి తర్వాత అక్కడి నుంచి తిరిగి బయలుదేరారు.

– బొమ్మలసత్రం

వేతనాల చెల్లింపుపై ఆందోళన వద్దు



పనులను పరిశీలిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు

దొర్నిపాడు: ఉపాధి వేతనాల చెల్లింపుపై శ్రామికులు ఆందోళన చెందవద్దని ఏపీఓ హనీఫా సూచించారు. గురువారం ఆమె ఉపాధి హామీ పనులపై టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆరా తీశారు. ఉపాధి పనుల్లో శ్రామికుల సంఖ్యను పెంచేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి రోజు మండలంలో 2,100 మందికి పనులు కల్పిస్తున్నట్లు చెప్పారు. మార్చి నెలాఖరు వరకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు శ్రామికుల వ్యక్తిగత ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. వేతనాల చెల్లింపుల్లో ఏమైనా సమస్యలుంటే కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ

కోవెలకుంట్ల: జాతీయ స్థాయి ఓపెన్ బాక్సింగ్ పోటీల్లో కోవెలకుంట్లకు చెందిన మోహన్‌తేజ సత్తా చాటాడు. ఇటీవల గోవాలోని కాలింగేట్‌లో యూత్ స్పోర్ట్స్ ప్రమోటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ విభాగంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పట్టణానికి చెందిన వెంకటరమణ కుమారుడు మోహన్‌తేజ బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. టీం చాంపియన్‌షిప్‌తో పాటు బెస్ట్‌ఫైటర్ అవార్డు వచ్చినట్లు టీం మేనేజర్ ఆనంద్ ఆచారి, అకాడమీ కోచ్ ఫయాజ్ తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు, స్నేహితులు అభినందించారు.

సినిమా థియేటర్లలో ఆర్డీఓ తనిఖీ



రామనాథ్ థియేటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ విశ్వనాథ్‌రెడ్డి

నంద్యాల అర్బన్: పట్టణంలోని పలు సినిమా థియేటర్లలో ఆర్డీఓ విశ్వనాథ్‌రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రామనాథ్, ప్రతాప్, శ్రీరామ, సంగీత్ తదితర థియేటర్ల రికార్డులను పరిశీలించిన అనంతరం సినిమా టికెట్ల ధరలపై ప్రేక్షకులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, స్టాల్స్, తినుబండారాల నాణ్యత, ధరలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీ చేశామని చెప్పారు. థియేటర్లకు ఆర్అండ్‌బీ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఫైర్ స్టేషన్ల సేఫ్టీ, ఎన్‌ఓసీ సర్టిఫికెట్, ఫిలింఛాంబర్ అగ్రిమెంట్ కాపీలతో పాటు లైసెన్స్ రెన్యూవల్ అయ్యి ఉండాలన్నారు. తహసీల్దార్ ప్రియదర్శిని, ఆర్ఐ ప్రసాద్ ఉన్నారు.

మోదీ భజనకే మహానాడు

- ప్రజలను మోసం చేసేలా చంద్రబాబు మాటలు
- సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పెనుమల్లి మధు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న మధు

నంద్యాల (న్యూటౌన్): ప్రధాని నరేంద్ర మోదీ భజన కోసమే మహానాడు పెట్టినట్లుందని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పెనుమల్లి మధు విమర్శించారు. కార్యక్రమంలో హిందూ, ముస్లింల మత సామరస్యం గురించి గానీ, మత వైషమ్యాల గురించి మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. గురువారం నంద్యాల జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పార్టీ స్థానిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు సెకీ ఒప్పందాన్ని రద్దు చేస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే మాట మార్చారన్నారు. ఒప్పందాన్ని 20 ఏళ్ల పాటు కొనసాగిస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. కడపలో జరిగిన మహానాడులో చంద్రబాబు నాయుడు మాట్లాడిన తీరు చూస్తే.. ప్రజల సమస్యల పరిష్కారానికి మార్గం చూపలేదన్నారు. రూ.1.20 పైసలుకు ఇచ్చే విద్యుత్‌ను రూ.4.60కు కొనాలని చెప్పడం చూస్తే ఆదానీకి దోచి పెట్టడానికేనని ఆరోపించారు. దీంతో విద్యుత్ బిల్లుల భారం ప్రజలపై భారీగా పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. డిస్కంలపై భారీగా అప్పులున్నాయని ఇవి ఎవరి కోసం చేశారని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నరేంద్ర మోదీని పొగడటానికే మహానాడును పెట్టుకున్నట్లు ఉందన్నారు. గత నెలలో రాష్ట్రానికి వచ్చిన మోదీ రాష్ట్రానికి ఏమి ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, నాగరాజు, రామచంద్రుడు, పుల్ల నరసింహ పాల్గొన్నారు.

హామీల అమలుపై పోరాటాలకు సిద్ధంకండి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరావు

నంద్యాల (న్యూటౌన్): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు సాధించేలా, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరావు సీపీఐ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా కౌన్సిల్ సమావేశం పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో గురువారం నిర్వహించారు. పహల్గాం దాడిలో చనిపోయిన 27 మంది పౌరులు, వీర జవాన్ మురళీ నాయక్‌కు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నక్సలిజం 2026 మార్చి నాటికి ఉండకూడదని ప్రధాని నరేంద్ర మోదీ, హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రవర్తిస్తున్నారు. చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణం చేసి ఏడాది గడుస్తున్నా ఎన్నికల హామీల అమలమాటేమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో ఉత్తరాది ఆధిపత్యం ఏమిటని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పుడు అదే ఉత్తరాది వారికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఎన్నికల హామీల అమలులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు నివాసయోగ్యమైన స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తానన్న ఎన్నికల హామీ ఏమైందని ప్రశ్నించారు. సూపర్ సిక్స్‌లో ప్రస్తుతం రెండు మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. మిగిలినవి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, మోటా రాముడు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

అవుకు: హత్యాయత్నం కేసులో నిందితుడికి గురువారం మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నంద్యాల జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. అవుకు పోలీసుల వివరాల మేరకు.. 2016 మే 2వ తేదీ అవుకు పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన కంచెర్ల లక్ష్మిదేవి ఇంటి ముందు అదే వీధికి చెందిన కట్టెల వెంకటేశ్వర్లు కుమారుడు మల విసర్జన చేయడంతో గొడవ జరిగింది. కంచర్ల లక్ష్మిదేవిపై కట్టెల వెంకటేశ్వర్లు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. బాధితులు అవుకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై సెక్షన్ 326, 307 ప్రకారం హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి కేసు విచారణ సాగుతోంది. గురువారం సాక్షులను నంద్యాల జిల్లా కోర్టులో హాజరుపరిచారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ నంద్యాల జిల్లా ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఎస్ తంగమణి తీర్పునిచ్చారు. హత్యాయత్నం కేసు దర్యాప్తు, సాక్షుల సేకరణతో పాటు నేరస్తులకు శిక్ష పడేలా చేసిన అవుకు పోలీసులకు జిల్లా పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు.



దొర్నిపాడులో కురుస్తున్న వర్షం



గుండుపాపల పొలాల్లో నిలిచిన వర్షపునీరు



శ్రీరంగాపురంలో దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ముంచెత్తిన వర్షం

- పొంగి పొర్లిన వాగులు, వంకలు
- కుంటలను తలపిస్తున్న పంట పొలాలు



ఆర్.పాంపల్లె గ్రామ సమీపంలో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు



ఉయ్యాలవాడలో చేపల చెరువు కట్ట తెగి ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఉయ్యాలవాడ/దొర్నిపాడు/రుద్రవరం: ఆళ్లగడ్డ నియోజవకర్గంలోని ఉయ్యాలవాడ, దొర్నిపాడు, రుద్రవరం మండలాల్లో గురువారం వర్షం ముంచెత్తింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పొలాలు వర్షపు నీటితో కుంటలను తలపించాయి. ఖరీఫ్ సీజన్ ముందే పదునైన వర్షాలు పడటంతో ముందస్తు పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 25న రోహిణి కార్తె ప్రారంభమైంది. ఈ కార్తెలో ఎండల తీవ్రత, వడగాల్పులు, ఉక్కపోతల ఉండాల్సింది పోయి.. నైరుతి రుతు పవనాల ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షాలతో వాతావరణం చల్లబడిందని ప్రజలు పేర్కొంటున్నారు. కాగా కొద్ది రోజుల నుంచి వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల రుద్రవరం మండలం శ్రీరంగాపురం గ్రామ సమీపంలో మినుము పంటలు తడిసి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారి సునీత గురువారం క్షేత్రస్థాయికి వెళ్లి పంటలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతానని ఆమె తెలిపారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

శ్రీశైలం టెంపుల్: లోక కల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద నెలకొని ఉన్న దత్తాత్రేయ స్వామివారికి విశేషపూజలను నిర్వహించింది. ముందుగా మహాగణపతిపూజ, తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు.